సాక్షి వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 7 । ఆగస్టు । 2024



పాఠశాలల్లో ఎన్నికల సందడి
పిల్లల పాఠశాలలకు పెద్దలు పోటీ పడుతున్నారు. ఈ నెల 8న జిల్లా వ్యాప్తంగా పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. -8లో



ఆధిక్యంలో కడప జట్టు
ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. కడప బౌలర్ ధీరజ్ కుమార్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. -8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
36.0/28.2
జిల్లాలో మంగవారం 28.2 - 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ర్యాలీతోపాటు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి నాగరాజారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కడప స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న గాంధీ విగ్రహం వరకు జాతీయ చేనేత దినోత్సవ ప్రాధాన్యతపై స్లోగన్స్‌తో ఫ్ల కార్డులతో ర్యాలీని నిర్వహిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం .. చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ అండ్ సేల్స్ ఉంటాయని వివరించారు.

11 వరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు



కడప కోటిరెడ్డిసర్కిల్: విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా కడప–విశాఖపట్టణం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 11వ తేది వరకు రద్దు చేసినట్లు కడప రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ మోహన్‌దాస్ తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

కలెక్టర్, ఎస్పీలతో సీఎం సమీక్ష



సీఎంతో చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర రాజధాని అమరావతిలోని సచివాలయ భవనంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు నిర్వహించిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండవరోజు వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలు వేర్వేరుగా జిల్లాలోని పలు అంశాలపై వారితో సమీక్షించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ అనురాధ తెలిపారు. ఈ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్తు ప్రామికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. తల్లిదండ్రుల కుటుంబ సంవత్సర ఆదాయం రూ. 3,50,000 లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ పరీక్ష ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీ జరుగుతుందని తెలిపారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 100, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు రూ. 50 చెల్లించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 6వ తేదీ వరకు గడువు ఉందని వివరించారు. పరీక్ష రుసుమును సెప్టెంబర్ 10వ తేదీలోపు చెల్లించాలన్నారు. పరీక్ష రుసుమును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www.breap.gov.inలో లేదా డీఈఓ కార్యాలయంలో కలవాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు

కాశినాయన: ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ, కాన్పుల గదులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలన్నారు. గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎస్ఓ రమేష్, ఏఎస్ఓ వెంకటరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, హెల్త్ సూపర్‌వైజర్లు, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పులివెందుల సిగలో మణిహారం

దశాబ్దాలుగా ఆదరిస్తున్న ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా ఆ కుటుంబం అడుగులేస్తుంది.. పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడమే ధ్యేయంగా నిత్యం తపించిపోతుంది. సొంతూరిపై మమకారం పంచాలన్నా... అభివృద్ధికి సహకారం అందించాలన్నా ఆ కుటుంబం తర్వాతే ఎవరైనా. అదే వైఎస్ కుటుంబం. వెనుకబడ్డ పులివెందులలో ఉన్నత విద్యాలయాలు స్థాపించారు. సాగునీటితో పచ్చదనం అద్ది కోనసీమను మరిపించారు. వైఎస్ జగన్ హయాంలో ఏర్పాటైన ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అడ్మిషన్లకు అనుమతిస్తూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ ప్రాంతవాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 50సీట్లు కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ఎంసీఐ... తాజా అడ్మిషన్లతో భర్తీ
- రూ.530కోట్లతో శరవేగంగా నిర్మించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్
- ఎంసీఐ అనుమతులపై సర్వత్రా హర్షం
- నాడు వైఎస్సార్ హయాంలో జేఎన్‌టీయూ, ట్రిపుల్ ఐటీ ఏర్పాటు
- తండ్రీకొడుకుల విశేష కృషి



పులివెందులలో వైఎస్సార్ సీపీ హయాంలో ఏర్పాటైన మెడికల్ కళాశాల

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్ఆర్‌సీపీ హయాంలో కడప గడపలో అభివృద్ధి వెల్లివిరిసింది. జిల్లా కేంద్రమైన కడపను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దారు. అత్యాధునిక వైద్య సేవలకు నిలయంగా మార్చారు. ప్రతిష్ఠాత్మకమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను తీసుకొచ్చారు. ఇక పుట్టిన గడ్డ పులివెందుల రుణం తీర్చుకునేందుకు సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేశారు. ఏపీఎంఎస్ ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ.530కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించారు. పార్లమెంటు పరిధిలో ఒక మెడికల్ కళాశాల నిర్మించాలనే సంకల్పంతో కడప పరిధిలోని పులివెందులలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు 2020 డిసెంబర్ 2న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 627 పడకలు వసతి గల ఆస్పత్రి నెలకొల్పారు. ఏడాదికి 150 మెడికల్ సీట్లు, 60 నర్సింగ్ సీట్లల్లో విద్యను అభ్యసించేలా వసతులు సమకూర్చారు. జీ ప్లస్ 3గా నిర్మించిన ఈ భవనాలు సరాసరిగా ఒక్కో ఫ్లోర్ 37,300 చదరపు అడుగులతో చేపట్టారు. ఆ మేరకు ఎంసీఐ బృందం స్వయంగా భవనాలు, అందుబాటులో ఉన్న వసతులను ప్రత్యక్షంగా పరిశీలించింది. వర్చువల్ విధానంలో మరోమారు తనిఖీలు చేపట్టి అనుమతుల జారీకి అంగీకరించింది.

సర్వత్రా హర్షం

జిల్లా అభివృద్ధి కోసం తండ్రీకొడుకులు వైఎస్ఆర్, వైఎస్ జగన్ విశేష కృషి చేశారు. ముఖ్యంగా తాము ప్రాతినిధ్యం వహించిన పులివెందుల గడ్డ రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమించారు. నాడు సీఎం హోదాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వేంపల్లెలో ట్రిపుల్ ఐటీ నెలకొల్పగా.. గత వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్ పులివెందులలో మెడికల్ కళాశాల తీసుకొచ్చారు. తండ్రీ కొడుకులిద్దరూ సీఎం హోదాల్లో ప్రతిష్టాత్మక విద్యాలయాలతో తమ ప్రాంత ముంగిట విద్యా పరిమళాలు అద్దారని స్థానికులు కొనియాడుతున్నారు.



మెడికల్ కళాశాలకు 50 సీట్లు కేటాయింపు...

పులివెందుల మెడికల్ కళాశాల అన్నీ అనుమతులు సాధించింది. సోమవారం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 50సీట్లు కేటాయిస్తూ ఎంసీఐ ఉత్తర్వులు జారీ చేసింది. మౌళిక వసతులన్నీ ఉన్నా, కళాశాల ఫ్యాకల్టీ దృష్టిలో పెట్టుకొని 50సీట్లు కేటాయించింది. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించి ఉంటే మరిన్ని సీట్లు దక్కే అవకాశం ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మెడికల్ కళాశాలకు ఎంసీఐ అనుమతులు దక్కాయని ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి ధ్రువీకరించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ పనులు పూర్తి చేస్తామని అండర్ టేకింగ్ ఇవ్వాల్సిందిగా ఎంసీఐ ఆదేశించింది. ప్రభుత్వం అండర్ టేకింగ్ ఇవ్వగానే డిపార్టుమెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) సీట్లు భర్తీకి అనుమతులు ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రధానంగా ఎంసీఐ అనుమతులు దక్కడంపై పులివెందుల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చారిత్రాత్మకం



పులివెందుల– కడప ప్రధాన రహదారిలో సుమారు రూ.500కోట్లతో నిర్మించిన మెడికల్ కళాశాలకు 50సీట్లు కేటాయించడం చరిత్రాత్మకం. మెడికల్ కళాశాలకు 50సీట్లు కేటాయించడం సంతోషంగా ఉంది. ఇక్కడ మెడికల్ కళాశాలకు సంబంధించి అన్ని వసతులు ఏర్పాటు చేస్తే చికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.
– వరప్రసాద్, మున్సిపల్ చైర్మన్

తండ్రి ఆశయాలను నెరవేర్చిన తనయుడు



పులివెందుల ప్రాంతంలో మెడికల్ కళాశాల నిర్మించాలని వైఎస్ఆర్ ఆశయం. ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తండ్రి ఆశయాలను నెరవేర్చాడు. మెడికల్ కళాశాలకు 50సీట్లు కేటాయించడం శుభపరిణామం.
– చిన్నప్ప, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్

నాణ్యమైన వైద్య విద్య అందుతుంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పులివెందులలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. మెడికల్ కళాశాలకు 50 సీట్లు కేటాయించడం సంతోషం. పూర్తిస్థాయిలో మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయిస్తే పులివెందుల ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యతో పాటు.. వైద్యం కూడా అందుతుంది.
–రసూల్, నూర్‌బాష్ సంఘం నాయకులు

ఎస్‌పీఏతో వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ ఎంఓయూ



ఎస్‌పీఏతో ఒప్పందం కుదుర్చుకుంటున్న వీసీ

ఏఎఫ్‌యూ: విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అర్కిటెక్చర్ (ఎస్‌పీఏ)తో కడప వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. మంగళవారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ డైరెక్టర్ ఆచార్య కొండా రమేష్ ఆధ్వర్యంలో ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథ కుమార్ ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అకడమిక్ అంశాలతో పాటు పరిశోధనకు సంబంధించిన కార్యకలాపాల్లో రెండు సంస్థలు కలిసి పనిచేస్తాయన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విద్యార్థులకు మెటీరియల్, వెబినార్లు, ఉపన్యాసాలు, విద్యార్థుల జ్ఞాన మార్పిడి, నైపుణ్య సంబంధిత అంశాలపై ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్కిటెక్చర్ డా. నాగరాజు, డీన్ డా. జనమేజోయ్ గుప్తా పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

జిల్లా మానసిక ఆరోగ్య జిల్లా అధికారులు రమేష్, కవితా ప్రసన్న




చాపాడులో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మానసిక అధికారి రమేష్

చాపాడు: మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని.. మానసికంగా ఇబ్బంది పడేవారిని గుర్తించాలని జిల్లా మానసిక ఆరోగ్య జిల్లా అధికారులు రమేష్, కవితా ప్రసన్న అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా కార్యక్రమంలో వారు మాట్లాడారు. మానసికంగా ఇబ్బందులు పడేవారిని ఎప్పటికప్పుడు గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితులను గమనిస్తూ వారిని మానసిక వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక వ్యక్తి తనలో తాను మాట్లాడుతూ ఏకాగ్రతలో ఆకస్మిక మార్పులు, స్పష్టంగా ఆలోచించడంలో ఇబ్బంది, పునరాలోచన, అహేతుకమైన ఆలోచనలు, కోపం, భయం, బాధ, విచారం వంటి భావాలు నిరంతరం ఉండుట, ఎవరితోనూ కలవకపోవటం, మొబైల్ చూడటం, రుగ్మతల గురించి వివరించారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం పెట్టిన 14416 లేక 1800-89-14416 నెంబరుకు కాల్ చేయాలని సూచించారు. వైద్యాధికారులు కావ్య మాధురి, శ్రీవాణి, ఓబులేసు, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్‌లు బాబురెడ్డి, సరస్వతీ, ఉపాధ్యాయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకలి కేకలు!

- పెన్షనర్లపై చంద్రబాబు సర్కార్ వివక్ష
- వారం రోజులవుతోన్నా అందని పెన్షన్
- ఎన్నికల మేనిఫెస్టోలో ఒకటో తేదినే ఇస్తామని చెప్పిన చంద్రబాబు
- ఆరోగ్య సమస్యలతో రిటైర్డ్ ఉద్యోగులు సతమతం
- ఆవేదనతో నిలదీస్తున్న పెన్షనర్లు





సాక్షి ప్రతినిధి, కడప: ఆయన పేరు ప్రసాద్ (పేరు మార్చాం). జీవిత కాలమంతా ఉద్యోగ బాధ్యతల్లోనే తలమునకలయ్యారు. ప్రస్తుతం పెన్షన్ మాత్రమే జీవనాధారం. నాలుగోతేదిలోపు హౌసింగ్ లోన్ ఈఎంఐ చెల్లించాలి. ప్రతి నెలా మొదటి వారంలో భార్యతోపాటు ఆయనకు నెల రోజులకు సరిపడా మందులు కొనుగోలు చేయాలి. నిత్యావసర వస్తువులు ఇతరత్రా ఖర్చులన్నీ పెన్షన్ మీదనే సర్దుబాటు చేసుకోవాలి. పెన్షన్ రావడం ఆలస్యమైతే మానసిక అలజడి ఎదుర్కోవాల్సి వస్తోంది. ఒక్క ప్రసాద్ పరిస్థితే కాదు మెజార్టీ పెన్షనర్లదీ అదే తీరు. జిల్లా వ్యాప్తంగా సుమారు 45వేలు పైగా పెన్షనర్లు ఉన్నారు. వారిలో 75శాతం మందికి నెలవారి పెన్షన్ కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

మాట తప్పిన చంద్రబాబు...

పెన్షనర్లకు ప్రతి నెలా 1వతేదినే పెన్షన్ అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అదే ఆధారం కావడంతో కుటుంబ పోషణ నిమిత్తం ఇకపై క్రమం తప్పకుండా పెన్షన్ లభిస్తుందని పెన్షనర్లు భావించారు. రెండు నెలల్లోనే చంద్రబాబు హామీ తేలిపోయింది. ఈ నెల 7వతేది వచ్చినా జిల్లాలో ఇప్పటికీ పెన్షనర్లకు పెన్షన్ అందలేదు. కడప ఎస్టీఓ పరిధిలో 9వేల మంది పెన్షనర్లు ఉన్నారు. వీరు ప్రతిరోజు బ్యాంకు మేసేజ్ కోసం ఎదురుచూస్తున్నారు. అకౌంట్లో డబ్బు పడిందా? లేదాని రోజులో మూడు సార్లు సెల్‌ఫోన్ చూస్తున్నారు. పొదుపు పాటించిన రిటైర్డ్ ఉద్యోగులకు కాస్తా వెసులుబాటు ఉన్నా, కుటుంబ పోషణ, అనారోగ్య సమస్యలు, పిల్లల భారంతో నెట్టుకొస్తున్న పెన్షనర్లకు సకాలంలో పెన్షన్ అందకపోతే మలి సంధ్యవేళ తీవ్ర ఇబ్బందులు తప్పవు. ప్రతి నెలా ఒకటోతేదినే వృద్ధులకు, వితంతులకు, వికలాంగులకు అందిస్తున్న రీతిలో పెన్షనర్లకు కూడా అందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సకాలంలో అందించాలి



విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్లు సకాలంలో అందించాలి. కుటుంబ పోషణకు, వైద్యం ఖర్చులకు, మందులకు పెన్షనే ఆధారం. పెన్షన్ సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి వెంటనే పెన్షన్ జమ చేయాలి.
– జి.పుల్లయ్య, విశ్రాంత ఉద్యోగి, బద్వేలు

ఇబ్బందులు పడుతున్నాం



పెన్షన్ సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి నెలా ఔషధాల కొనుగోలుతో పాటు బ్యాంకులకు రుణాలు చెల్లించాల్సి ఉంది. సకాలంలో రుణం చెల్లించకపోతే బ్యాంకుల నుంచి ఒత్తిడి ఎదురవుతుంది. ప్రశాంత జీవనం గడపాల్సిన సమయంలో పెన్షన్ కోసం ఎదురుచూడాల్సి రావడం ఆవేదనకు గురిచేస్తోంది. – ఎం.పిచ్చయ్య, విశ్రాంత ఉద్యోగి, బద్వేలు

హామీని నిలబెట్టుకోవాలి



ఆరవ తేదీ వచ్చినప్పటికీ ఇంతవరకు రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ రాలేదు. దీంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. సీఎం చంద్రబాబు నాయుడు ఒకటవ తేదీనే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోవాలి.
– ఎస్.నాగేష్, జిల్లా కోశాధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం

చాలా కష్టంగా ఉంది



పెన్షనర్లకు ప్రధానంగా మెడికల్‌తో పాటు ఇతర ఖర్చులు ఉంటాయి. ఒకటవ తేదీ రాగానే అవసరాల కోసం డబ్బులు కావాలి. సమయానికి పెన్షన్ రాకపోతే పెన్షనర్లంతా ఇబ్బందులు పడుతారు. ప్రభుత్వం ఒకటో తేదీనే పెన్షన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి.
– వెంకటసుబ్బయ్య, పెన్షనర్, కడప

ఒకటో తేదీనే పెన్షన్ వేయాలి



ప్రతినెలా ఒకటో తేదీనే పెన్షన్ వేయాలి. గత ప్రభుత్వంలో ఒకటి, రెండు తేదీల్లోనే పెన్షన్ అకౌంట్‌లో జమ అయ్యేది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరో తేదీ అయినా ఇంకా జమకాకపోవడంతో పెన్షనర్లు ఎదురు చూస్తున్నారు. పెన్షనర్లకూ హాస్పిటల్ ఖర్చులు, ఆర్థిక అవసరాలు ఉంటాయి కాబట్టి ఒకటో తేదీనే పెన్షన్ వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– చెన్నారెడ్డి, ప్రొద్దుటూరు తాలుకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఇబ్బందిగా ఉంది



నా సహచరులంతా ఒకటోతేదీన వచ్చే పెన్షన్ పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పటివరకు పెన్షన్ రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఒకటవ తేదీ వచ్చిందంటే ఎంతో ఖర్చు ఉంటుంది. ప్రభుత్వం పెన్షనర్లపై దయ చూపాలి.
– రాయుడు, పెన్షనర్, కడప.

వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే పతనమే



వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే ఏ కుటుంబమయినా, సమాజమైనా, ప్రభుత్వమైనా పతనం కాక తప్పదు. వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రతినెలా సమయానికి పింఛన్ అందించాలి. సామాన్యులైనా, ఉద్యోగులైనా వృద్ధాప్యంలో కష్టాలు తప్పవు. కొన్ని లక్షల కుటుంబాలు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్నాయి.
– డాక్టర్ మూలె రామమునిరెడ్డి, రిటైర్డు తెలుగు పండిట్, ప్రొద్దుటూరు

పెన్షన్ రాకపోతే ఎలా బతకాలి



ఇప్పటి వరకు పెన్షన్ రాలేదు. పెన్షన్‌పైనే ఆధారపడి బతికే వాళ్లం. ఎలా బతకాలి. మందులకు, కుటుంబ అవసరాలకు డబ్బు కావాలి కదా.. ప్రభుత్వం పెన్షన్ వెంటనే ఇవ్వాలి.
– మహమ్మద్, పెన్షన్‌దారుడు, మైదుకూరు

నేడు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడి రాక

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు జంగం రాజేంద్రప్రసాద్ బుధవారం కడపకు రానున్నట్లు కలెక్టర్ శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారు. అలాగే హాస్టళ్ల సంక్షేమ అధికారులు, గురుకుల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ అధికారులతో సమావేశం కానున్నారు. అదేవిధంగా ఓ సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసి రాత్రి అక్కడే బస చేయనున్నారని వివరించారు.

దళిత కమిషనర్‌పై టీడీపీ మూకల దౌర్జన్యం దారుణం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

రాజంపేట రూరల్: దళితుడైన మున్సిపల్ కమిషనర్ రాంబాబుపై టీడీపీ రౌడీ మూకలు దౌర్జన్యానికి పాల్పడటం నీచమైన చర్య అని దళిత సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు. స్థానిక ఆర్అండ్‌బీ ఎదుట ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం దళిత సంఘాల (మాల మహానాడు, ఏపీ ఎమ్మార్పీఎస్) నాయకులు నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. అనంతరం పట్టణ సీఐ మద్దయ్య ఆచారికి కమిషనర్‌పై దౌర్జన్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు చేశారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఒక దళిత అధికారిపై టీడీపీ రౌడీమూకలు సోమవారం తన చాంబర్‌కు వెళ్లి దౌర్జన్యం చేసి బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జోరోపల్లి భాస్కర్, దండుగోపీ, సత్యాల రామకృష్ణ, దాసరి పెంచలయ్య, రంగాల కమలాకర్, శేఖర్‌బాబు, నరసింహులు, గొంటు మణి, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని యూనిట్-2 పరిధిలో కోల్ మిల్స్ వద్ద పైపులైన్ లీకేజీ అయి నీరు ప్రవహిస్తోంది. ఆ నీళ్లు అక్కడ పేరుకుని పోయిన బూడిదతో కలవడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానిక ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజులుగా నిల్వ ఉన్న ఈ బూడిద నీళ్లను తొలగించే చర్యలను అధికారులు చేపట్టడం లేదని వారు వాపోతున్నారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, కార్మికులు జారి పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఆర్టీపీపీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - ఎర్రగుంట్ల

నేల పాలైన బియ్యం



రైలు వ్యాగిన్ ద్వారా మంగళవారం కడప రైల్వేస్టేషన్‌కు రేషన్ బియ్యం చేరాయి. ఈ బియ్యాన్ని లారీల ద్వారా రైల్వే స్టేషన్ నుంచి కడప నగరంలోని మార్కెట్‌యార్డు పక్కన ఉన్న గోడౌన్‌లకు తరలించారు. లారీల నుంచి బియ్యాన్ని దించే క్రమంలో కొన్ని బస్తాలు చినగడం, కొన్ని బస్తాలకు కుట్లు ఊడిపోవడంతో బియ్యం కింద పడిపోతున్నాయి. ఈ కింద పడ్డ బియాన్ని ఆవు తింటుండగా 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. ఇక్కడ కొసమెరుపు ఏమిటంటే ఈ బస్తాల్లో తక్కువ వచ్చిన బియ్యాన్ని డీలర్లకు అప్పచెబితే.. వారు కార్డు లబ్ధిదారులకు తక్కువ చేసి బియ్యాన్ని ఇస్తారనే ఆరోపణలు ఉన్నాయి. - కడప అగ్రికల్చర్


అక్కర లేని కయ్యం



చాపాడు మండలం మైదుకూరు - ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చించివేశారు. అల్లాడుపల్లె సర్పంచ్ గోసుల కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదివారం సాయంత్రం చాపాడులో, అల్లాడుపల్లె క్రాస్ వద్ద, నయారా పెట్రోల్ బంక్ సమీపంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి 11 గంటల వరకూ యథావిధిగా ఉన్న ఫ్లెక్సీలు మంగళవారం ఉదయం నాటికి చింపేసి ఉన్నాయని సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. - చాపాడు

పాఠశాలల్లో ఎన్నికల సందడి

- 8న విద్యా కమిటీ ఛైర్మన్ల ఎంపిక
- అధికార పక్షానికి అండగా నిలుస్తున్న పోలీసులు
- విపక్ష పార్టీల వారికి బెదిరింపులు



ఎర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల

జమ్మలమడుగు/మైలవరం/ఎర్రగుంట్ల : పిల్లల పాఠశాలలకు పెద్దలు పోటీ పడుతున్నారు. ఈ నెల 8వ తేదీన జిల్లా వ్యాప్తంగా పాఠశాలల విద్యా కమిటీ ఛైర్మన్ ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన జాబితాను విడుదల చేశారు. దీంతో విద్యా కమిటీ ఛైర్మన్‌ల ఎన్నిక కోసం అధికార పార్టీకి చెందిన నాయకులు తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.

రెండేళ్లకు ఒక సారి

జిల్లాలో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1997 ఉండగా అందులో 1,41,199 మంది విద్యార్థులు చదువుతున్నారు. రెండేళ్లకు ఒకసారి విద్యాకమిటీ ఛైర్మన్‌లను ఎన్నుకుని పాఠశాలల పనితీరు, అభివృద్ధి పరిశీలించే బాధ్యత ఛైర్మన్, సభ్యులకు ఉంటుంది. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను కమిటీ ఛైర్మన్ సహకారంతో ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో గ్రామాల్లోని పాఠశాలల్లో తమ పట్టు నిలుపుకొనేందుకు అధికార పార్టీకి చెందిన నాయకులు.. ఇతరులు ఎవరూ పోటీ చేయకూడదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నిర్వహణ ఇలా..

పాఠశాలల్లో సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతి యూనిట్‌గా ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు, ముగ్గురిలో ఒకరు తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనార్టీకి చెందిన వ్యక్తి అయి ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికలకు 50 శాతం ఓటర్ల హాజరును రిజిస్టర్‌లో చూపిన తర్వాతనే ఎన్నిక జరపాలి. అలాగే ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యులు హాజరు కావాలి. క్లాసుల వారీగా ఎన్నికై న సభ్యులందరూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. అదే విధంగా తరగతిలో కనీసం ఆరుగురు విద్యార్థులు లేకపోతే మరో తగతిలోకి విలీనం చేసి ఎన్నుకోవాలి.

పరిశీలకులు వీరే..

స్కూల్ కమిటీ ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా ఉంటారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వీఆర్‌ఓలు ఎన్నికల పరిశీలికులుగా ఉంటారు. తల్లి, తండ్రి పిల్లల సంరక్షకులుగా ఉన్నవారు ఓటర్లుగా ఉంటారు. సోమవారం ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు పూర్తయ్యాయి. 8వ తేదీన మధ్యాహ్నం 1 గంట లోపు సభ్యులతోపాటు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహించాలి.

ముమ్మరంగా ప్రచారం

మైలవరం మండల పరిధిలోని నార్జాంపల్లి గ్రామంలో విద్యాకమిటీ ఎన్నికల కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకులు పోటాపోటీగా పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ అభ్యర్థిని బలపరచాలంటూ ఇరు పార్టీలకు చెందిన నాయకులు కోరుతున్నారు. దీంతో గ్రామంలో పంచాయతీ ఎన్నికల తరహా ఊపు వచ్చింది. దీంతో గ్రామంలో ఏమి జరుగుతుందో అన్న భయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అధికార పార్టీ నాయకులు పాఠశాల కమిటీ ఛైర్మన్ అభ్యర్థి తమ వాడు కాకుండ పోతాడేమో అన్న అనుమానం రావడంతో.. వారు పోలీసుల ద్వారా కూడా ఒత్తిడి తీసుకుని వచ్చి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూస్తున్నారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలం ఎక్కువగా ఉండటంతో ఎలాగైనా గెలవాలని కూటమి నాయకులు పట్టుబడుతున్నారు. పోలీసులు సైతం అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లొంగి.. వైఎస్సార్‌సీపీ నాయకులు నామినేషన్ వేయవద్దు అని గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా సహకరించాలంటూ చెబుతున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ నాయకులు మాత్రం గ్రామంలో తమకు మద్దతు ఎక్కువగా ఉందని, టీడీపీ లేదు కాబట్టి వారు నామినేషన్ వేయకుండా తమకు ఏకగ్రీవం ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

పోటీ లేకుండా చేయమంటున్నారు



గ్రామంలో విద్యాకమిటీ ఎన్నికల్లో పోటీ లేకుండా చేయాలంటూ పోలీసులు, ఉపాధ్యాయులు తమపై ఒత్తిడి తీసుకుని వస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్నటువంటి విద్యార్థులు తమ వర్గానికి సంబంధించిన వారు ఎక్కువగా ఉన్నారు. బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన వారు మాత్రమే పాఠశాలలో చదువుతున్నారు. టీడీపీ వర్గానికి సంబంధించిన పిల్లలు మాత్రం జమ్మలమడుగులోని ప్రైవేట్ స్కూల్స్‌లో చదువుతున్నారు. వారి పాఠశాలపై పెత్తనం కోసం ఆరాటం పడుతున్నారు. ముందుగా వారి పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే పోటీ నుంచి తప్పుకొంటాం. - మునిరెడ్డి, నార్జాంపల్లి, మైలవరం మండలం

సర్వం సిద్ధం



మండల పరిధిలో 39 ప్రాథమిక పాఠశాలలు, 5 యూపీ, 9 ఉన్నత, 1 ఎయిడెడ్ హైస్కూల్, 3 రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో విద్యా కమిటీ ఛైర్మన్ ఎన్నికల కోసం సర్వం సిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులకు చెప్పాం. - వెంకటరమణారెడ్డి, ఎంఈఓ 1, జమ్మలమడుగు

పారదర్శకంగా..



మండల వ్యాప్తంగా 50 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే గ్రామాలలో సమాచార నోటీస్ బోర్డులో ఓటరు జాబితా ప్రదర్శించాం. అభ్యంతరాలు కూడా స్వీకరించాం. - శివప్రసాద్, ఎంఈఓ, ఎర్రగుంట్ల

ఆధిక్యంలో కడప జట్టు

నెల్లూరు బ్యాట్స్‌మన్ మన్విత్‌రెడ్డి 134 పరుగులు



మన్విత్‌రెడ్డి, నెల్లూరు (132 పరుగులు)



హర్షసాయిరెడ్డి, చిత్తూరు (102 పరుగులు)



యశ్వంత్, పశ్చిమ గోదావరి (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 6 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 78.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. జట్టులోని మన్విత్‌రెడ్డి 175 బంతుల్లో 134 పరుగులు చేశాడు. ఈయనకు జతగా హమీద్ 66, కారుణ్య 64 పరుగులు చేశారు. కడప బౌలర్లు ధీరజ్‌కుమార్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 347 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కడప జట్టు స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది.

సెంచరీ సాధించిన హర్షసాయిరెడ్డి

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న చిత్తూరు, పశ్చిమగోదావరి జట్ల మ్యాచ్‌లో 99 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 83 ఓవర్లలో 288 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగిన చిత్తూరు జట్టుకు చెందిన ఎం.హర్షసాయిరెడ్డి 14 ఫోర్లు, 1 సిక్సర్‌తో 102 పరుగులు చేశాడు. ఈయనకు జతగా లోహిత్‌లక్ష్మినారాయణ 58 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్ యశ్వంత్ 5 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమగోదావరి జట్టు 24 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది. జట్టులోని ప్రణీత్ పవన్ 34 పరుగులు చేశాడు. కాగా పశ్చిమ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 262 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పశ్చిమ జట్టు 50 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఆధిక్యంలో కృష్ణా జట్టు

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 34 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన శ్రీకాకుళం జట్టు 43 ఓవర్లలో 137 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సుశాంత్ 27, రోహిత్‌కుమార్ 23 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు యశ్వంత్ 4, సాయిప్రకాష్ 2, గీత్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది. జట్టులోని ధనుష్ 56 పరుగులు చేశాడు. కాగా కృష్ణా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కృష్ణా జట్టు 204 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ప్రజా పోరాట యోధుడు గద్దర్

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : ప్రజా పోరాట సాంస్కృతిక యోధుడు గద్దర్ ప్రజల్ని మహాశక్తివంతులుగా మార్చడానికి తీసుకున్న ఏకై క ఆయుధం పాటేనని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య కొనియాడారు. మంగళవారం మదనపల్లి రామారావు కాలనీలోనీ ఏఐటీయూసీ కార్యాలయంలో గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ పీడిత వర్గాల గొంతుకగా నిలిచి, పాటనే అస్త్రంగా చేసుకుని ప్రజా ఉద్యమాలలో సాంస్కృతిక విప్లవాన్ని సృష్టించిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని అన్నారు. గద్దర్ సాహిత్యం, జీవితంను వేరు వేరుగా చూడలేమన్నారు. సమాజంలో భావ విప్లవం, సాంస్కృతిక విప్లవం రెండూ నిరంతరం కొనసాగాలని సూచించారు. కేవలం సాయుధ విప్లవం ఒంటరిగా విజయవంతం కాదని గద్దర్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కూడా గద్దర్ పాటే ప్రాణం పోసిందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ పేరు మీద స్మారక అవార్డులు ఇవ్వాలని తీర్మానం చేసినట్టు గానే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఏటా గద్దర్ జయంతి రోజున గద్దర్ స్మారక అవార్డులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణప్ప, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి తిరుపతి జిల్లా కార్యదర్శి జింకా నాగరాజు, అన్నమయ్య జిల్లా ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ సహాయ కార్యదర్శి ముబారక్, మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమలప్ప, దేవేంద్ర, నాగేశ్వరి, రమణమ్మ, రఘు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం ఫారెస్ట్ కార్యాలయం పరిశీలన



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ నాగార్జునరెడ్డి

సిద్దవటం : సిద్దవటంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని కడప డివిజనల్ సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ నాగార్జునరెడ్డి మంగళవారం సందర్శించారు. కార్యాలయం పచ్చని చెట్లు, రంగు రంగులతో ఎంతో ఆహ్లాదకరంగా ఉందని ఆయన కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లను పెంచడం వల్ల చల్లని గాలితోపాటు మంచి ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. తాను కొండూరులోని నర్సరీని పరిశీలించేందుకు వెళ్తూ ఇక్కడికి రావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్ కళావతి పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు రోడ్డు మార్గం ఏర్పాటు



రోడ్డు మార్గాన్ని పరిశీలిస్తున్న సీఐ పురుషోత్తం రాజు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో గిరిప్రదక్షిణకు కావాల్సిన రోడ్డు మార్గాన్ని సీఐ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్గానికి ఆటంకాలుగా ఉన్న చెట్లు, ముళ్లపొదలను జేసీబీలు, డోజర్లతో తొలగిస్తూ అనువుగా తయారు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రెండు పౌర్ణమిల నుంచి గిరిప్రదక్షిణ మొదలు పెట్టామని, రానున్న ఆగస్టు 19వ తేదీన శుక్లపక్షం పౌర్ణమి నాడు శ్రీరామ భక్తులందరూ గిరిప్రదక్షిణలో పాల్గొనాలని ఆయన కోరారు.

నూతన నియామకం



ఏఐఎఫ్‌బీ సీమ కన్వీనర్ జయవర్ధన్

కడప ఎడ్యుకేషన్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ(ఏఐఎఫ్‌బీ) రాయలసీమ జిల్లాల కన్వీనర్‌గా జాల జయవర్ధన్‌ను నియమించారు. ఈ నెల నాలుగో తేదీ కడప నగరంలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కన్వెన్షన్ మీటింగ్‌లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజులు రాయలసీమ జిల్లాల బాధ్యతను జయవర్ధన్‌కు అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1939లో అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ స్థాపించారని తెలిపారు.

ఒంటెలు స్వాధీనం

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీలో 16 ఒంటెలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ మంగళవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో అక్కడికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని వివరించారు.

బాలిక అదృశ్యం

బి.కొత్తకోట : చిత్తూరు జిల్లా కల్లూరుకు చెందిన బాలిక అదృశ్యంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. 15 ఏళ్ల బాలిక జూలై 3న అదృశ్యమైనట్లు తండ్రి బాల కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ కేసు నమోదయింది. అయితే అదృశ్యమైన బాలిక బి.కొత్తకోటలోని పిటిఎం రోడ్డులో కనిపించినట్టు సమాచారం రావడంతో.. కేసును అక్కడి నుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. దీనిపై ఏఎస్ఐ బొజ్జి నాయక్ మళ్లీ ఇక్కడ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక్కడ కేసు నమోదు అయిన విషయాన్ని కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు.

తేనెటీగల దాడిలో నలుగురికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమాదేవి

మదనపల్లె : తేనెటీగల దాడిలో నలుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. త్యాగరాయ వీధిలోని కృష్ణా స్కూల్ సమీపంలో ఓ ఇంటి గోడకు ఏర్పడిన తేనె తుట్టె నుంచి తేనెటీగలు గుంపుగా వచ్చి, ఆ దారిలో వెళుతున్న పాదచారులపై దాడి చేశాయి. ఈ ఘటనలో చంద్రశేఖర్ (52), రమాదేవి (45) రెడ్డి మహమ్మద్ (40), ఖాదర్ వలీ (42)లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం వారు కోలుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెండ్లిమర్రి : మండల పరిధి కొత్తపేట గ్రామ సమీపంలోని పాపాఘ్నినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడులు చేశారు. నాలుగు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. వాటిని పోలీసుస్టేషన్ వద్ద ఉంచి సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఎల్సీడీసీ సర్వే వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ రవిబాబు

బ్రహ్మంగారిమఠం : మండల వ్యాప్తంగా ఎల్సీడీసీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెప్రసీ సర్వేను వేగవంతంగా పూర్తి చేసి సస్పెక్టెడ్ కేసులను గుర్తించాలన్నారు. ఇదే క్రమంలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ నెల 20న జరిగే డీవార్మింగ్ డే, స్టాప్ డయేరియా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సంపత్‌కుమార్, సూపర్‌వైజర్‌లు పుష్పరాజు, రమణమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి విద్యార్థులతో కలిసి మంగళవారం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుస్తున్నాయని అన్నారు. వర్షానికి కూలిపోయే ప్రమాదం ఉన్నా.. అలాంటి వసతిగృహాల్లోనే విద్యార్థులు తమ కార్యకలాపాలు కొనసాగించాల్సి వస్తోందని తెలిపారు. ప్రధానంగా వార్డెన్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఒకే వార్డెన్ రెండు మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జిలుగా ఉండడంతో ఎక్కడా పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించలేకపోతున్నారన్నారు. వంటమనిషి, కామాటి, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంక్షేమ శాఖలో 23 ఖాళీ వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె శివశంకర్, నగర అధ్యక్షుడు అరుణ్, జిల్లా ఉపాధ్యక్షుడు తేజచంద్ర, నాయకులు అకిరానంద్, పీటర్ టోని, అఖిల్, రాజేషు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.